ప్రజాశక్తి
సోమవారం 30 జూన్ 2025
5
శ్రీ సత్యసాయి



మొదటి దశ పనులు పూర్తి చేస్తాం

◆ గతేడాది కంటే ఎక్కువగానే నీళ్లు

◆ హంద్రీనీవా చీఫ్ ఇంజినీర్ కె.నాగరాజ

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

జులై రెండవ వారంలోపు మొదటి దశ హంద్రీనీవా కాలువ వెడల్పు పనులు పూర్తవుతాయని హంద్రీనీవా చీఫ్ ఇంజనీర్ కె.నాగరాజ తెలిపారు. 'ప్రజాశక్తి'కి ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో హంద్రీనీవా సుజల స్రవంతి పురోగతిపై పలు విషయాలు తెలియజేశారు.



కె.నాగరాజ

ప్ర : హంద్రీనీవా అభివృద్ధి పనులు ఎప్పటిలోపు పూర్తవ్వొచ్చు.?

సిఇ : హంద్రీనీవా మొదటి దశ కాలువ వెడల్పు పనులు నడుస్తున్నాయి. అదే సమయంలో రెండవ విడత లైనింగ్ పనులు జరుగుతున్నాయి. మొత్తం 12 ప్యాకేజీల్లో ఈ పనులు నడుస్తున్నాయి. మొదటి దశ కాలువ వెడల్పు పనులు జులై రెండవ వారంలోపు పూర్తవ్వొచ్చని అంచనా వేస్తున్నాం. ఇక రెండవ దశ లైనింగ్ పనులు ఇప్పటి వరకు 25 శాతం పూర్తయ్యాయి. తక్కిన నీళ్లు వచ్చే వరకు సాధ్యమైనంత త్వరగా పనులు చేపడతాం. నీళ్లు వస్తే అక్కడితో ఆపి వచ్చే సీజన్‌లో లైనింగ్ పూర్తయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి.

ప్ర: ఈ ఏడాది అనంతపురం జిల్లాకు హంద్రీనీవా ద్వారా నీళ్లు ఏ మేరకు వచ్చే అవకాశముంది ?

సిఇ : గతేడాది కంటే ఈసారి నీళ్లు ఎక్కువగానే వచ్చే అవకాశముందని అంచనా వేస్తున్నాం. ఇప్పుడిప్పుడే శ్రీశైలం డ్యామ్‌కు నీళ్లు వస్తున్నాయి. జులై రెండవ వారంలోపు మొదటి దశ కాలువ వెడల్పు పనులు పూర్తవుతే నీళ్లు పూర్తి స్థాయిలో తీసుకునే అవకాశముంది. గతేడాది జిల్లాకు 30 టిఎంసిల నీళ్లను తీసుకున్నాం. ఈసారి 50 టిఎంసిల వరకు నీళ్లను హంద్రీనీవా ద్వారా తీసుకునేందుకు వీలుంటుందని అంచనా వేస్తున్నాం. గతేడాది కంటే కాలువ సామర్థ్యం పెరిగినందున సాధ్యమైనంతగా ఎక్కువ నీళ్లే జిల్లాకు వచ్చే అవకాశముంది.



ప్ర: భైరవానితిప్ప, పేరూరు ఎత్తిపోతల పథకం పరిస్థితి ఏమిటి.?

సిఇ : భైరవానితిప్ప, పేరూరు ఎత్తిపోతల పథకం ఇంకా భూ సేకరణ జరగాల్సి ఉంది. ఇది వరకే దీనికి సంబంధించి ప్రతిపాదనలు ప్రభుత్వం వద్దనున్నాయి. భూసేకరణ పూర్తవగానే ఈ ప్రాజెక్టు పనుల్లోనూ పురోగతి ప్రారంభమయ్యే అవకాశాలున్నాయి.

ప్ర : సిఎల్‌డిపి సామూహిక బిందుతుంపెర సేద్యం ప్రాజెక్టులో కదలికొచ్చే అవకాశముందా ?

సిఇ : సిఎల్‌డిపిలో సామూహిక బిందు,తుంపెర సేద్యం ప్రాజెక్టు పనులు తిరిగి ప్రారంభమయ్యే అవకాశాలైతే ఉన్నాయి. ప్రభుత్వానికి నివేదిక పంపించాం. అనుమతులొచ్చాక పనులు ప్రారంభం అవుతాయి.



అక్రమాల ప్లానింగ్..!

◆ అనుమతి ఒకలా.. నిర్మాణం మరోలా..!

◆ ఇంటి పేరుతో వ్యాపార సముదాయం నిర్మాణం

◆ పెనుకొండలో అస్తవ్యస్తంగా టౌన్ ప్లానింగ్ విభాగం

పెనుకొండ పట్టణంలో కొన్నింటి గృహాలకు అనుమతులు ఒకలా తీసుకుని నిర్మాణాలు మరొకరకంగా చేస్తున్నారు. ఇంటి నిర్మాణాల పేరుతో అనుమతులు తీసుకుని వ్యాపార సముదాయాలను నిర్మించేస్తున్నారు. ఇలాంటి వాటిని నియంత్రించాల్సిన అధికారులే అడ్డదారిన అనుమతులు ఇచ్చేస్తూ అక్రమాల'ప్లానింగ్'కు అనుమతులు ఇస్తుండడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తం అవుతున్నాయి.

ప్రజాశక్తి-పెనుకొండ

పెనుకొండ పంచాయతీ స్థాయి నుంచి నగర పంచాయతీగా రూపాంతరం చెందింది. దశాబ్ధ కాలంగా పట్టణ ప్రాంతం పెరగడంతో నిర్మాణాలు పెరిగాయి. ఇదే సమయంలో కొందరు నిర్మాణాల్లో అక్రమాలకు తెరలేపారు. కళ్లేదుటే వ్యాపార భవన సముదాయాలు నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణం జరుగుతున్నా టౌన్ ప్లానింగ్ సిబ్బంది నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. మూడేళ్ల క్రితం ఇంటి నిర్మాణానికి తీసుకుని పదుల సంఖ్యలో వ్యాపార భవనాలను నిర్మిస్తున్నా అధికారులు ఏమీ ఎరుగనట్లు వ్యవహరించడం చర్చనీయాంశమైంది. అనుమతులు లేకనే పెద్ద పెద్ద భవనాలు నిర్మాణాలు చేస్తూ ప్రభుత్వ ఆదాయానికి గండికొడుతున్నారు. పెనుకొండ నగరపంచాయతీ పరిధిలో వైసిపి పాలనలో అక్రమ భవనాలు, అనుమతులు లేని నిర్మాణాలు విచ్చలవిడిగా జరిగాయనే విమర్శలున్నాయి. ప్రస్తుత కూటమి ప్రభుత్వంలోనూ దానికి కొనసాగింపుగా ఈ నిర్మాణాలు జరుగుతుండడం గమనార్హం.

మూడేళ్ల క్రితం ఇంటి నిర్మాణానికి అనుమతులు

పెనుకొండ పట్టణానికి చెందిన ఓ వ్యక్తి జిఐసి కాలనీలో ఇంటి నిర్మాణం కోసం 2021జూలై నెలలో రూ.84వేలు ఆన్‌లైన్లో చలానా చెల్లించి అనుమతులు తీసుకున్నారు. ఆ సమయంలో ఇంటి నిర్మాణానికి అనుమతులు తీసుకుని వ్యాపార భవన సముదాయాలు నిర్మిస్తున్నారని ఆ వార్డు కౌన్సిలర్ రఘునాథ్ రెడ్డి నిర్మాణ పనులను అడ్డగించారు. ఇదే సమయంలో అప్పటి మాజీ ఎమ్మెల్యే, ప్రస్తుత హిందూపురం ఎంపీ బీకే పార్థసారథి భవన యజమానికి మద్దతు పలికారు. వైసిపి ప్రభుత్వం ఉండడంతో వ్యాపార సముదాయాల నిర్మాణం చేయకుండా అప్పట్లో అడ్డుకున్నారు.

యథేచ్ఛగా వ్యాపార భవనసముదాయాల నిర్మాణం

కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన అనంతరం వైసిపి పాలనలో ఆగిన నిర్మాణ పనులను భవన యజమాని మళ్లీ ప్రారంభించారు. ఈ నిర్మాణం అనుమతులు ఇంటి నిర్మాణానికి తీసుకుని మరొకటి చేస్తున్నా టౌన్ ప్లానింగ్ అధికారులు పట్టించుకోవడం లేదు. ఫలితంగా నగర పంచాయతీ ఆదాయానికి గండి పడింది. ఇదేక్కటే కాదు పట్టణంలో ఎక్కడ చూసినా అనధికార భవన నిర్మాణాలు జరుగుతున్నా సంబంధిత అధికారులు మాత్రం స్పందించడం లేదు. పట్టణంలో పలు ప్రాంతాల్లో ఇష్టారాజ్యంగా అనుమతులు లేకుండా నిర్మాణాలు జరుగుతున్నాయి. టౌన్ ప్లానింగ్ అధికారులు భవనాల వైపు కన్నెత్తి చూసిన దాఖలాలే లేవు. రాజకీయ నాయకుల ఒత్తిళ్లతోనే లేక తమకెందుకులే అని భావించి ఇలా వ్యవహరిస్తున్నారన్న చర్చ పట్టణంలో జోరుగా సాగుతుంది.

పేదల నిర్మాణాలకు మాత్రం అడ్డంకులు

బడాబాబుల నిర్మాణాలు పట్టించుకోని అధికారులు నిరుపేదలు, మధ్యతరగతి ప్రజలు మరుగుదొడ్లు నిర్మిస్తున్నా వెంటనే వచ్చి వాలిపోతున్నారు. నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణం చేస్తున్నారంటూ పేదలను లక్ష ప్రశ్నలతో ఉక్కిరిబిక్కిరి చేస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా రెండు మూడు అంతస్తుల భవనాలు నిర్మిస్తున్నా ఎందుకు స్పందించడం లేదని పలువురు ప్రశ్నిస్తున్నారు.

అస్తవ్యస్తంగా టౌన్ ప్లానింగ్ విభాగం

పెనుకొండ మేజర్ పంచాయతీ స్థాయి నుంచి నగర పంచాయతీ అయ్యింది. పేరుకు నగర పంచాయతీ అయినా టౌన్ ప్లానింగ్ విభాగం మాత్రం అస్తవ్యస్తంగా తయారైంది. ఆ విభాగంలో పూర్తి స్థాయి అధికారులు లేరు. గతంలో ఇద్దరు ఇన్‌ఛార్జి టౌన్ ప్లానింగ్ అధికారులు ఉండేవారు. వారిపై పలు అవినీతి ఆరోపణలు రావడంతో వారిద్దరూ సొంత స్థానాలకు వెళ్లిపోయారు. అప్పటినుంచి పెనుకొండ నగర పంచాయతీకి టౌన్ ప్లానింగ్ అధికారి లేరు.



జిఐసి కాలనీలో ఇంటికి అనుమతి తీసుకుని వ్యాపార సముదాయానికి జరుగుతున్న నిర్మాణం



అనుమతుల్లేకుండా జరిగిన రెండు అంతస్తుల భవన నిర్మాణం..

పరిశీలించి చర్యలు తీసుకుంటాం



పట్టణంలో జరుగుతున్న నిర్మాణాలను పరిశీలిస్తాం. నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు జరుగుతుంటే చర్యలు తీసుకుంటాం. ఇంటి నిర్మాణానికి అనుమతులు తీసుకుని వ్యాపార భవన సముదాయాలు నిర్మించరాదు. నివాస ప్రాంతాల్లో భవన నిర్మాణం ఉంటే వాటికి పన్నులను విధిస్తాం. అనుమతులు లేకుండా నిర్మాణాలు ఉంటే నిబంధనల మేరకు కూల్చివేస్తాం.

సతీష్ కుమార్, కమిషనర్.

14న 'చలో కలెక్టరేట్' : ప్రజా జెఎసి

ప్రజాశక్తి-మడకశిర

రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలపై జరిగిన దాడులు, హత్యలు, అత్యాచారాలను నిరసిస్తూ జులై 14వ తేదీ కలెక్టరేట్ ఎదుట ప్రజా సంఘాల జెఎసి ఆధ్వర్యంలో చేపట్టనున్న ధర్నాను జయప్రదం చేయాలని ప్రజా సంఘాల జెఎసి నాయకులు పిలుపునిచ్చారు. పట్టణంలోని డిహెచ్‌పిఎస్ కార్యాలయంలో డిహెచ్‌పిఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు ఎంఆర్.హనుమంతు అధ్యక్షతన నిర్వహించిన విలేకరుల సమావేశం నిర్వహించారు. నాయకులు మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలకు రక్షణ కల్పించాలని కోరారు. కార్యక్రమంలో ఎస్సీ జన సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు దాసిగానిపల్లి కుళ్లాయప్ప, బహుజన చైతన్య వేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు, హైకోర్టు అడ్వకేట్ శివరామకృష్ణ, బిసి ఐక్య వేదిక నాయకుడు రామకృష్ణ, భారతీయ భీమ్ సేనా వ్యవస్థాపక అధ్యక్షుడు రామాంజనేయులు, డిహెచ్‌పిఎస్ ఉపాధ్యక్షుడు ఎం.శ్రీనివాస్, బివిసి ఉపాధ్యక్షుడు బాబు, ఓబులేష్, రఘునాథ్, అంజి, రంగా, జయన్న, నరసింహప్ప, ముద్దరంగప్ప పాల్గొన్నారు.



చలో కలెక్టరేట్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ప్రజా జెఎసి నాయకులు

ప్రభుత్వ బడులను పరిరక్షించుకుందాం : యుటిఎఫ్

ప్రజాశక్తి-పెనుకొండ

ప్రభుత్వ పాఠశాలలను పరిరక్షించుకుందామని జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శెట్టిపి జయచంద్రారెడ్డి, ఎం.సుధాకర్ పిలుపునిచ్చారు. పట్టణంలోని మౌర్య రెసిడెన్సీలో ఆదివారం జయ చంద్రారెడ్డి అధ్యక్షతన జిల్లా యుటిఎఫ్ కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలను బలోపేతం చేయాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలను చేర్పించి నాణ్యమైన విద్యనందించి తల్లిదండ్రుల్లో నమ్మకం కలిగిద్దామని ఉపాధ్యాయులను కోరారు. ప్రభుత్వం 9 రకాల పాఠశాలలు ఏర్పాటు చేయగా అందులో 9,652 మోడల్ ప్రాథమిక పాఠశాలు, 1-10 తరగతుల ఉన్నత పాఠశాలలు 1,552, ప్రాథమికోన్నత పాఠశాలలు అప్‌గ్రేడ్ చేసిన ఉన్నత పాఠశాలలు 779, ఫౌండేషన్ పాఠశాలలు 5వేలు బేసిక్ ప్రాథమిక పాఠశాలలు 19వేలు ఉన్నాయన్నారు. ఫౌండేషన్, బేసిక్ ప్రాథమిక పాఠశాలలు ఏకోపాధ్యాయ పాఠశాలలుగా మారే ప్రమాదం ఉందని వివరించారు. వీటిని బలమైన పాఠశాలలుగా మార్చుకోవాల్సిన అవసరం ఉందన్నారు. తద్వారా ప్రభుత్వ విద్యారంగ మనుగడ సాధ్యపడుతుందన్నారు. ఇక ఇటీవల 67,732 మంది ఉపాధ్యాయులు బదిలీ కాగా 4,477 మందికి ఉద్యోగోన్నతి వచ్చిందన్నారు. ఈ పరిస్థితుల్లో ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని దానికి అనుగుణంగా విద్యా విధానాన్ని అమలు చేయాలని, పాఠశాల పని వేళల్లో బోధనేతర పనులు, శిక్షణ తరగతులు లేకుండా చూడాలని కోరారు. అలాగే ఆర్థిక బకాయిలు చెల్లించాలని, పిఆర్‌సి కమిషన్‌ను నియమించి 30శాతం ఐఆర్ ప్రకటించాలని, పెండింగ్ డిఎలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గౌరవాధ్యక్షులు భూతన్న, కోశాధికారి శ్రీనివాసులు, జిల్లా కార్యదర్శులు తాహిర్‌వలి, లక్ష్మీనారాయణ, శివశంకర్, నారాయణస్వామి, నరేష్‌కుమార్, క్రిష్టప్ప, నరసింహప్ప, ఆడిట్ కమిటీ కన్వీనర్ మహంతేశ్వర్, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న యుటిఎఫ్ నాయకులు

అమరాపురంలో పర్యటించిన శిక్షణ డీఎస్పీలు

ప్రజాశక్తి-మడకశిర

అమరాపురం మండలంలో ఆదివారం శిక్షణ డీఎస్పీలు శ్రీనివాసులు, ధనుర్భ పర్యటించారు. వారు ముందుగా హేమావతి ఎంజేరు సిద్దేశ్వరస్వామి ఆలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వారి వెంట ఆలయ కమిటీ చైర్మన్ కరేగౌడ్, టిడిపి మండల అధ్యక్షులు ఈ.కృష్ణమూర్తి, ఎంపిటిసి ఓంకార్, నాయకులు కృష్ణమూర్తి, రామచంద్రప్ప, పిఎస్.ప్రసాద్, సిద్దేశ్వర, ఉపాధ్యక్షులు హనుమంతరాయ ఉన్నారు.



ఎంజేరు సిద్దేశ్వరస్వామి ఆలయంలో శిక్షణ డీఎస్పీలు

ఘనంగా జ్యోతుల మహోత్సవం

చెన్నేకొత్తపల్లి : మండలంలోని వెంకటంపల్లి గ్రామంలో ఆదివారం జ్యోతుల మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ముందుగా గ్రామపెద్దల ఆధ్వర్యంలో స్థానిక మహిళలు తలపై జ్యోతులు, బోనాలు ఎత్తుకుని భక్తిశ్రద్ధలతో ఊరేగింపుగా ఆలయం వద్దకు చేరుకుని చౌడేశ్వరీ మాతకు సమర్పించారు. అలాగే అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని ప్రత్యేకంగా అలంకరించి వాహనంలో కొలువుదీర్చి గ్రామ వీధుల్లో ఊరేగించారు. యువకులు బోనం దుత్తపై జ్యోతులు వెలిగించుకుని వాహనం ముందు నృత్యాలు చేశారు. అమ్మవారి ఊరేగింపున తిలకించడానికి వివిధ గ్రామాల నుంచి భక్తులు పెద్దఎత్తున తరలివచ్చారు. అనంతరం ఆలయానికి చేరుకున్న అమ్మవారికి భక్తులు బోనం సమర్పించుకున్నారు. అలాగే భక్తులు అమ్మవారికి ముడుపులు చెల్లించుకున్నారు.

'ఆశా' పోస్టుకు దరఖాస్తు చేసుకోండి

రొద్దం : మండలంలోని పెద్దమంతూరు పిహెచ్‌సి పరిధిలోని ఉప్పరపల్లి, చెరుకూరు గ్రామాలకు కలిపి ఓ ఆశా కార్యకర్త పోస్టుకు దరఖాస్తు చేసుకోవాలని వైద్యాధికారి డాక్టర్ సి.రమ్య ఆదివారం తెలిపారు. దరఖాస్తులను జులై 7వ తేదీ లోపు పిహెచ్‌సిలో అందజేయాలన్నారు. వివరాలకు పిహెచ్‌సిలో సంప్రదించాలన్నారు.

తాడిపత్రికి పెద్దారెడ్డి

◆ ఏడాది తర్వాత తన ఇంటికి

◆ అడ్డుకున్న పోలీసులు

◆ బలవంతంగా అనంతపురం తరలింపు

◆ రెడ్‌బుక్ రాజ్యాంగం అంటూ ఆగ్రహం

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి, తాడిపత్రి

సార్వత్రిక ఎన్నికల అనంతరం తాడిపత్రిలో నెలకొన్న వివాదం ఇంకా చల్లారలేదు. ఎన్నికల అనంతరం తాడిపత్రికి మాజీ ఎమ్మెల్యే పెద్దారెడ్డిని రానించేది లేదంటూ మున్సిపల్ ఛైర్మన్ జెసి.ప్రభాకర్‌రెడ్డి స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో పెద్దారెడ్డి హైకోర్టును ఆశ్రయించారు. హైకోర్టు అనుమతి ఇచ్చినా శాంతిభద్రతల కారణం చూపి పెద్దారెడ్డిని పోలీసులు తాడిపత్రి వెళ్లేందుకు అనుమతించలేదు. ఈ నేపథ్యంలో ఆదివారం ఉదయం పెద్దారెడ్డి ఎవరికీ తెలియకుండా తాడపత్రికి వెళ్లారు. యల్లనూరులోని తన స్వగ్రామం నుంచి తాడిపత్రిలోని తన నివాసానికి ఉదయం 7-30 గంటలకు వెళ్లారు. పెద్దారెడ్డి వచ్చిన విషయం తెలియగానే పోలీసులు పెద్ద సంఖ్యలో అక్కడికి చేరుకున్నారు. శాంతిభద్రతల దృష్ట్యా తాడిపత్రికి ఉండేందుకు వీల్లేదంటూ పెద్దారెడ్డికి తెలిపారు. ఈ సమయంలో పెద్దారెడ్డి పోలీసులపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. తన ఇంట్లో తాను ఉండేందుకు వీల్లేదని చెప్పడం ఏమిటంటూ ప్రశ్నించారు. అయినా పోలీసులు వినకుండా బలవంతంగా ఆయన్ను నంతపురం పంపారు.

ఎన్నికల అనంతరం తాడిపత్రిలోకి నో ఎంట్రీ

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి వైసిపి మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి తాడిపత్రి పర్యటనను తాడిపత్రి మున్సిపల్ ఛైర్మన్ జెసి.ప్రభాకర్‌రెడ్డి అడ్డుకుంటున్నారు. ఎన్నికల ఫలితాలొచ్చిన సమయంలోనే తాడిపత్రి వెళితే దాడులకు సిద్ధపడ్డారు. దీంతో ఆయన్ను బయటకు పంపించారు. అప్పటి నుంచి పోలీసులు ఆయన పర్యటనకు అనుమతించడం లేదు. ఈ నేపథ్యంలో ఆయన హైకోర్టును ఆశ్రయించారు. తాడిపత్రి పట్టణంలోకి అనుమతించాలని కోరుతూ వేసిన పిటిషన్‌పై ఐదు వాహనాల్లో తగిన భద్రతతో అనుమతించాలని కోర్టు ఉత్తర్వులిచ్చింది. ఆ ఉత్తర్వులు వెలువడిన తరువాత కూడా వివిధ కారణాలతో పోలీసులు ఆయన పర్యటనకు అనుమతించ లేదు. తాజాగా పోలీసులకు సమాచారం ఇవ్వకుండానే నేరుగా ఆదివారం ఉదయం తాడిపత్రిలోని ఆయన నివాసానికి పెద్దారెడ్డి చేరుకున్నారు. విషయం తెలిసిన వెంటనే పోలీసులు అక్కడికి చేరుకుని ఆయన్ను వెనక్కు పింపించారు.

పెద్దారెడ్డి మాత్రమే మా శత్రువు
జెసి.ప్రభాకర్‌రెడ్డి

'తమ శత్రువు పెద్దారెడ్డి మాత్రమేనని, వైసిపి కార్యకర్తలు కాదని తాడిపత్రి మున్సిపల్ ఛైర్మన్ జెసి.ప్రభాకర్‌రెడ్డి తెలియజేశారు. ఆదివారం నాడు ఈయన ఓ వీడియో విడుదల చేశారు. ఇప్పటి వరకు తాము న్యాయపరంగా మాత్రమే వెళ్తున్నామని చెప్పారు. వైసిపి నాయకులు జైళ్లు బాగా కట్టించుకోండి అని చెబుతున్నారని, తాము ఇప్పుడే రఫ్ఫారఫ్ఫా ఆడిస్తే వారి పరిస్థితి ఏమిటన్నారు. పెద్దారెడ్డి అధికారంలో ఉన్నప్పుడు తన ఇంటికి వచ్చిన విషయాన్ని మర్చిపోయారంటూ ప్రశ్నించారు. పెద్దారెడ్డితో ఉంటే ఎవరినీ వదలమన్నారు.



పెద్దారెడ్డిని బలవంతంగా ఇంటి నుంచి బయటకు తీసుకొస్తున్న పోలీసులు

ఎంతకాలం అడ్డుకుంటారో చూస్తాం :పెద్దారెడ్డి

తాను తాడిపత్రికి వెళ్లేందుకు హైకోర్టు అనుమతులు ఇచ్చినా పోలీసులు జెసి.ప్రభాకర్‌రెడ్డి మాటలు విని అడ్డుకుంటున్నారని, ఇలా ఎంత కాలం అడ్డుకుంటారో చూస్తామని పెద్దారెడ్డి తెలిపారు. ఆదివారం ఆయన అనంతపురంలో వైసిపి నాయకులతో కలిసి విలేకరులతో మాట్లాడారు. జెసి.ప్రభాకర్‌రెడ్డి పోలీసులను అడ్డుపెట్టుకుని తనను అడ్డుకుంటున్నారని, ఎళ్లకాలం ఈ రాజకీయాలు చెల్లవని, తమ టైం వచ్చినప్పుడు తాము కూడా ఇంతకింత చేస్తామని పెద్దారెడ్డి తెలిపారు. ఏ చట్టాల ప్రకారం పోలీసులు పెద్దారెడ్డిని తాడిపత్రికి అనుమతించడం లేదో చెప్పాలని మాజీ మంత్రి డాక్టర్ శైలజనాథ్ ప్రశ్నించారు. ఇలాగే పోలీసులు అడ్డుకుంటూపోతే జిల్లా ఎస్పీ కార్యాలయం ఎదుట బైఠాయిస్తామని వైసిపి జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి చెప్పారు. రాష్ట్రంలో భారత రాజ్యాంగం కాకుండా రెడ్‌బుక్ రాజ్యాంగం అమలు జరుగుతోందని మాజీ ఎంపి తలారి రంగయ్య విమర్శించారు.

వైసిపి కార్యకర్తలకు అండగా ఉంటాం

ప్రజాశక్తి-మడకశిర

వైసిపి కార్యకర్తలకు ఎల్లప్పుడూ అండగా ఉంటామని ఆ పార్టీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు నరసింహమూర్తి తెలిపారు. మండలంలోని గుండుమల గ్రామానికి చెందిన వైసిపి సోషల్ మీడియా కార్యకర్త దళిత మంజునాథ్ భార్య సంధ్యను ఆదివారం వైసిపి నాయకులు పరామర్శించారు. అలాగే రూ. 5వేలు అందజేసి మీ కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. అనంతరం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ మంజునాథ్ వైసిపి సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉండడంతో కూటమి నాయకులు జీర్ణించుకోలేక పోలీసుల చేత అక్రమంగా అరెస్ట్ చేయించి జైలుకు పంపించార న్నారు. ఈ అక్రమ అరెస్టును తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఇకనైనా కూటమి ప్రభుత్వం అక్రమ కేసులు బనాయించడం, అరెస్టులు చేయడం మాని సంక్షేమ పథకాల అమలు, అభివృద్ధిపై దృష్టి సారించాలని హితవు పలికారు. ఆయనతో పాటు జిల్లా ఎస్సీ విభాగం అధ్యక్షురాలు, జడ్పిటిసి సరోజమ్మ నరసింహ మూర్తి, నాయకులు సికిందర్, నరసింహా, రంగనాథ్, తిప్పేస్వామి, మంజు, నాగేష్ ఉన్నారు.



మంజునాథ్ భార్య సంధ్యకు నగదు అందజేస్తున్న వైసిపి నాయకులు

నాణ్యమైన విద్యనందించడమే ధ్యేయం

షిరిడీసాయి బాలికల జూనియర్ కళాశాల చైర్మన్ వీరభద్రప్ప

ప్రజాశక్తి-గోరంట్ల

ఆహ్లాదకరమైన వాతావరణంలో క్రమశిక్షణ, విలువలతో కూడిన విద్యనందించడమే షిరిడీసాయి బాలికల జూనియర్ కళాశాల ధ్యేయమని ఆ కళాశాల ఛైర్మన్ వీరభద్రప్ప తెలిపారు. పట్టణంలోని సరస్వతి విద్యా మందిర్ క్యాంపస్‌లో నూతన యాజమాన్యం నిర్వహణలో ఈ ఏడాది (2025-26 విద్యా సంవత్సరం) షిరిడీ సాయి బాలికల జూనియర్ కళాశాల నిర్వహిస్తున్నారు. కళాశాల ఛైర్మన్ వీరభద్రప్ప మాట్లాడుతూ విద్యార్థినులకు క్రమశిక్షణ, అత్యున్నత ప్రమాణాలతో నాణ్యమైన విద్యను అందిస్తున్నా మన్నారు. కళాశాలలో ఎంపిసి, బైపిసి, ఎంబైపిసి, ఎంఈసి కోర్సులు అందుబాటులో ఉన్నాయన్నారు. మెరిట్ స్కాలర్‌షిప్ సౌకర్యం, బస్సు సౌకర్యం ఉందన్నారు. పదో తరగతి పరీక్షల్లో 550కు పైగా మార్కులు సాధించిన 50 మంది విద్యార్థులకు ఎంఈడిఎస్ ఎన్జీవో ద్వారా ఇంటర్‌లో ఉచిత విద్యనందిస్తామన్నారు. విద్యార్హత, అనుభవం కలిగిన మహిళా అధ్యాపక బృందం పాఠాలు బోధిస్తారన్నారు. ఎన్ఎస్ఎస్ యూనిట్ ద్వారా సామాజిక సేవ, సువిశాలమైన ఆహ్లాదకరమైన వాతావరణం, కామర్స్ విద్యార్థులకు సిఎ ఫౌండేషన్ కోర్సులో శిక్షణ ఇస్తామన్నారు. ఆడపిల్లల భద్రత, క్రమశిక్షణ, ఉత్తమమైన విద్యాబోధన మా ప్రత్యేకం అన్నారు. అడ్మిషన్లు ప్రారంభమయ్యాయని కళాశాలలో సంప్రదించాలని కోరారు.



విద్యార్థిని రమ్యశ్రీకి ల్యాప్ టాప్ అందజేస్తున్న మంత్రి సవిత

విద్యార్థినికి ల్యాప్‌టాప్ అందజేత


ప్రజాశక్తి-రొద్దం

మండల కేంద్రమైన రొద్దంకు చెందిన టిడిపి కార్యకర్త నీరుగంటి వీరాంజనేయులు కుమార్తె రమ్యశ్రీకి ఎస్ఆర్ఆర్ ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం మంత్రి సవిత పట్టణంలోని తన కార్యాలయంలో ల్యాప్ టాప్ అందజేశారు. విద్యార్థిని రమ్యశ్రీ ఇంటర్‌లో ఎంపిసి విభాగంలో 951 మార్కులు, బీటెక్ ప్రథమ సంవత్సరంలో మంచి మార్కులు సాధించడంతో మంత్రి సవిత గుర్తించి ల్యాప్ టాప్ అందజేశారు. భవిష్యత్తులో కూడా బాగా చదివి తల్లిదండ్రులు, గ్రామానికి మంచి పేరు తేవాలని మంత్రి సూచించారు. కార్యక్రమంలో విద్యార్థిని తండ్రి వీరాంజి, టిడిపి మండల కన్వీనర్ నరహరి, నాయకులు టైలర్ ఆంజనేయులు, పెద్దగువ్వలపల్లి పవన్, డీలర్ సిద్దన్న, బబుల్‌రెడ్డి పాల్గొన్నారు.

వైసిపి నాయకులు టిడిపిలో చేరిక

ప్రజాశక్తి-మడకశిర

మండలంలోని మెళవాయి గ్రామానికి చెందిన వైసిపి నాయకులు ఆదివారం పట్టణంలో టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు గుండుమల తిప్పేస్వామి ఆధ్వర్యంలో టిడిపిలో చేరారు. విజి.రంగస్వామి, సి.పవన్, విజి.గంగరాజు, కె.తిమ్మయ్య, జిబి.రంగనాథ్‌తో పాటు 10 కుటుంబాలు వైసిపి పార్టీకి రాజీనామా చేసి పసుపు కండువా కప్పుకొన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు లక్ష్మీనారాయణ, నారాయణగౌడ, రామకృష్ణ, సోమశేఖర్‌రెడ్డి, సోము, గోవిందరాజులు, నాగరాజు, రాజశేఖర్, శ్రీరామ్ రెడ్డి, ఫీల్డ్ అసిస్టెంట్లు జి.మంజునాథ్, హరినాథ్‌రెడ్డి, డీలర్లు మల్లికార్జున, జి.రంగనాథ్, తదితరులు పాల్గొన్నారు.



వైసిపి నుంచి టిడిపిలో చేరిన నాయకులు

ప్రజాసమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు

ప్రజాశక్తి - కదిరి అర్బన్

శాసనసభ్యులు వెంకట ప్రసాద్ ఆదేశాల మేరకు కదిరి మున్సిపాలిటీకి చెందిన 32 వ వార్డు లో ఉన్న సమస్యలను గుర్తించి పరిష్కరిస్తున్నట్లు టిడిపి నాయకులు మున్సిపల్ కౌన్సిలర్లు అధికారులు తెలిపారు. ప్రజలు, ప్రభుత్వ ఉపాధ్యాయుడైన రాజు నాయక్ ద్వారా ఇచ్చిన ఫిర్యాదు మేరకు రాజేంద్రప్రసాద్ వీధిలో మురికి కాలవలో పూడిక తీయకపోవడం వల్ల తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు చెప్పారు. అక్కడ ప్రైవేట్ స్థలములో మున్సిపల్ కాలువ పూడిపోవడంతో కాలవ లోని మురికి నీళ్లతో దుర్గంధ మైన వాసన వస్తోందన్నారు. స్థానికులు ఫిర్యాదు మేరకు అక్కడ పరిస్థితులను పరిశీలించి శుభ్రపరచాలని సానిటరీ ఇన్స్పెక్టర్ నటరాజ్ బాబుకు ఆదేశించినట్లు మున్సిపల్ చైర్ పర్సన్ కె ఎస్ దిల్షాదున్నిసా బాహువుద్దిన్, తెలిపారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ మున్సిపల్ వైస్ చైర్మన్ సేగు సుధారాణి బాబయ్య, మున్సిపల్ కౌన్సిలర్లు సిఎ ఇస్మాయిల్, బండారు మురళి, శానిటరీ ఇన్స్పెక్టర్, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

నేత్ర దానంతో ఇద్దరికి కంటిచూపు

ప్రజాశక్తి -ధర్మవరం రూరల్

ధర్మవరం పట్టణంలోని సిద్దయ్య గుట్టకు చెందిన చెక్క వెంకటేష్ అనే వ్యక్తి ఆదివారం గుండెపోటుతో మృతి చెందాడు. ఈ సందర్భంగా విశ్వరూప సేవా సంఘం వ్యవస్థాపకులు కోళ్ల మొరం చంద్రశేఖర్ రెడ్డి, అధ్యక్షులు గాజుల సురేష్ మాట్లాడుతూ విశ్వదీప సేవా సంఘం వారు మృతుని కుటుంబ సభ్యులకు నేత్రదానంపై గతంలో అవగాహన కల్పించారన్నారు. మృతుని కుటుంబ సభ్యుల అంగీకారంతో విశ్వదీప సేవా సంఘం ఆధ్వర్యంలో జిల్లా అంధత్వ నివారణ సంస్థ, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ డిప్యూటీ కుల్లాయప్ప, కంటి వైల్డ్ సెంటర్ టెక్నీషియన్ రాఘవేంద్ర తదతరులు మృతుని నేత్రాలను సేకరించామన్నారు. నేత్రదానానికి సహకరించిన మృతుని భార్య నాగవేణి, కుమార్తెలు రజిత, పూజిత, అల్లుళ్ళు బాలాజీ, డెంగీ మోహన్ కుమార్ కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు చంద్రశేఖర్ రెడ్డి, జుజారు రఘు, ఖమ్మం మాధవ ప్రభాకర్ రెడ్డి ఫణీంద్ర నాగ , తదితరులు పాల్గొన్నారు.

'ఉపాధి' అవినీతిపై విచారణ జరపాలి

ప్రజాశక్తి - చిలమత్తూరు

ఉపాధిహామీ పథకంలో అవినీతి తారాస్థాయికి చేరిందని, దీనిపై కేంద్ర ప్రభుత్వం విచారణ జరపాలని వైఎస్సార్సీపీ పంచాయతీరాజ్ విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు కులశేఖర్ రెడ్డి డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో ఆదివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తల్లికి వందనం పథకాన్ని సర్పంచుల కుటుంబాలకు వర్తింపజేయాలని, 15వ ఆర్థిక సంఘం నిధులైన రూ.1150 కోట్లు స్థానిక సంస్థల ఖాతాల్లో తక్షణమే జమ చేయాలని డిమాండ్ చేశారు. జీవో నెం.11 రద్దు చేసి, 1350 మంది పంచాయతీ సెక్రటరీలకు పోస్టింగులు ఇవ్వాలని, పెండింగ్‌లో ఉన్న వేతనాలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

'వాసవి'లో సరదా జాతర

ప్రజాశక్తి-హిందూపురం

పట్టణంలోని శ్రీ వాసవి కళ్యాణమండపంలో ఆదివారం శ్రీ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో సరదా జాతర నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణ వాసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. నోరు ఊరించే వంటకాలతో రుచులు, రకాల వస్తువులతో పాటు, ఫ్యాన్సీ డ్రెస్సులు, చీరలు, రెడీమేడ్ దుస్తులు ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం నాయకులు శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

సబ్సిడీతో కంది, ఉలవలు అందజేయాలి

ప్రజాశక్తి - గాండ్లపెంట

మండలంలోని రైతులకు సబ్సిడీతో కంది, ఉలవ, పెసర, అలసంద తదితర పంటల విత్తనాలను అందజేయాలని రైతు సంఘం నాయకుడు కేకే రాజారెడ్డి డిమాండ్ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖరీఫ్ లో సాగు చేసే రైతులకు వేరుశనగ తో పాటు అంతర పంటలు వేసుకోవడానికి సబ్సిడీ ధరలతో రైతులకు చిరుధాన్యాల విత్తనాలు అందించాలన్నారు.

జాతీయ స్థాయి సమావేశానికి 'పురం' చైర్మన్‌కు ఆహ్వానం

ప్రజాశక్తి-హిందూపురం

జాతీయ స్థాయి సమావేశానికి హిందూపురం మున్సిపల్ చైర్మన్ రమేష్ కుమార్‌కు ఆదివారం ఆహ్వానం వచ్చింది. జూలై 3, 4 తేదీల్లో రెండు రోజుల పాటు హర్యానాలోని గురుగ్రామ్ లో భారత పార్లమెంటు హర్యానా ప్రభుత్వ సహకారంతో.. దేశంలోని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల పట్టణ స్థానిక సంస్థల చైర్మన్లకు "రాజ్యాంగం, ప్రజాస్వామ్యం, దేశ నిర్మాణంలో పట్టణ స్థానిక సంస్థల పాత్ర" అంశంపై అవగాహన కల్పించడం కోసం రెండు రోజులు జాతీయ సమావేశాలు జరగనున్నాయి. ఈ సమావేశాలకు ఏపీ నుంచి మున్సిపల్ కార్పొరేషన్ మేయర్లు, మున్సిపల్ చైర్మన్లు, డిప్యూటీ చైర్మన్లను నామినేట్ చేస్తూ ప్రభుత్వ ఉత్తర్వులు జారీ చేసింది. వీరందరికీ నోడల్ ఆఫీసర్‌గా రాజమండ్రి మున్సిపల్ శాఖ రీజినల్ డైరెక్టర్, నాగ నరసింహారావు వ్యవహరించనున్నారు.

ఆత్మీయ కలయిక

ప్రజాశక్తి - చిలమత్తూరు

మండలంలోని పొట్టి శ్రీరాములు జెడ్పీ హైస్కూల్ 2000– 2001 బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు ఆదివారం కోడూరు గ్రామంలోని ఎంపీపీఎస్ పాఠశాలలో ఆదివారం ఆత్మీయ కలయిక నిర్వహించారు. దాదాపు 24 ఏళ్ల అనంతరం మళ్లీ ఒకచోట చేరిన వారు పాఠశాల జ్ఞాపకాలను పునర్జీవింపజేశారు. కలిసి గడిపిన ఆ సరదా క్షణాలను గుర్తు చేసుకుంటూ, కేక్ కట్ చేసి పరస్పర ఆనందాన్ని పంచుకున్నారు.

అస్తవ్యస్తంగా పారిశుధ్య వ్యవస్థ

♦విజృంభిస్తున్న దోమలు ♦ఫొటోలకే పరిమితమైన స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర ♦ సీజనల్ వ్యాధులు ప్రబలే ప్రమాదం ♦పట్టించుకోని అధికారులు

ప్రజాశక్తి - చిలమత్తూరు

మండలంలోని పలు గ్రామాల్లో పారిశుధ్య వ్యవస్థ అస్తవ్యస్తంగా తయారైంది. డ్రయినేజీలు చెత్త చెదారంతో నిండిపోయి పూడిక చేరి మురుగు నీరు రోడ్లపైకి వస్తోంది. వాతావరణంలో మార్పుల వల్ల సీజనల్ వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉంది. వీధుల్లో, డ్రయినేజీల్లో పేరుకుపోయిన చెత్త చెదారం తొలగింపుపై అధికారులు ఏమాత్రం దృష్టి సారించడం లేదు.కొన్ని గ్రామాల్లోని వీధుల్లో ఎక్కడి చెత్త అక్కడే ఉంటోంది. దీంతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. గ్రామాల్లో ఎక్కడి సమస్యలు అక్కడే ఉన్నా అధికారులు పట్టించు కోవడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మురుగు నీరు నిల్వ ఏర్పడి భరించలేని దుర్వాసన వెదజల్లుతోంది. పారిశుధ్య లోపంతో దోమలు విజృంభిస్తున్నాయి.

నెరవేరని లక్ష్యం

కూటమి ప్రభుత్వం ప్రతి నెలా 3వ శనివారం స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర కార్యక్రమం ద్వారా పారిశుధ్యంపై అవగాహన కల్పిస్తోంది. అయితే మండలంలోని కొన్నిగ్రామాల్లో ఈ కార్యక్రమ లక్ష్యం నెరవేరడంలేదు. కొంతకాలంగా గ్రామాల్లో ఎక్కడా పూర్తి స్థాయిలో పారిశుధ్య పనులు చేపట్టడం లేదని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి గ్రామాల్లో పారిశుధ్యాన్నిమెరుగుపరచాలని ప్రజలు కోరుతున్నారు.



కొత్తచామలపల్లి ఎస్సీకాలనీలో రోడ్డుపై నిలచిన మురుగునీరు

మహాన్యూస్ కార్యాలయంపై దాడి దారుణం : ఎపిడబ్ల్యూజెఎఫ్

ప్రజాశక్తి - ధర్మవరం రూరల్

ప్రజాస్వామ్యంలో జరుగుతున్న అన్యాయాలని వెలికితీస్తున్న మీడియాపై దాడులు చేయడం హేయమైన చర్య అని ఎపిడబ్ల్యూజెఎఫ్ ధర్మవరం డివిజన్ నాయకులు అన్నారు. పట్టణంలో ఆదివారం జరిగిన డివిజన్ సమావేశంలో ఏపీడబ్ల్యూజేఎఫ్ డివిజన్ కమిటీ అధ్యక్షులు మురళి గౌడ్, ప్రధాన కార్యదర్శి పతకమూరి నాగభూషణ, గౌరవ అధ్యక్షులు భాస్కర్ గౌడ్, కోశాధికారి బీమినేని వెంకటేశ్వర చౌదరి, పట్టణ అధ్యక్షులు మజ్జిగ భాస్కర్, ఉపాధ్యక్షులు గంటపార నాగరాజు, దేగల రవికుమార్, ఆర్, మల్లికార్జున, ప్రజాశక్తి ఆంజనేయులు, పట్టణ కోశాధికారి జ్వాలా ప్రసాద్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. మహాన్యూస్ కార్యాలయంపై జరిగిన దాడిని వారు ఖండించారు,ఈ జర్నలిస్టులపై దాడి పత్రిక స్వేచ్ఛకు విఘాతం కలిగించడమేననిపేర్కొన్నారు. ఈ దాడికి ఒడిగట్టిన బాధ్యులు ఏ పార్టీ వారైనా ఎంతటి వారైనా వారిపై చర్యలు తీసుకోవడమే కాక కుట్ర కోణాన్ని ఛేదించాలని డిమాండ్ చేశారు. ఇటీవల రాజకీయ పార్టీలు సంఘవిద్రోహ శక్తులు మీడియాపై దాడికి ప్రయత్నిస్తున్నాయని వీటిని ఎట్టి పరిస్థితుల్లో జర్నలిస్టు సంఘాలు అంగీకరించబోవనిఅన్నారు. ఈ కార్యక్రమంలో మహా న్యూస్ ప్రసాద్ రెడ్డి, సభ్యులు బాబయ్య , శ్రీనాథ్ గౌడ్, మంజునాథ్,అక్షర అబ్దుల్లా తదితరులు పాల్గొన్నారు.

భోజనం ప్యాకెట్లు పంపిణీ

ప్రజాశక్తి - ధర్మవరం రూరల్

శ్రీ సత్య సాయి సేవా సమితి కన్వీనర్ నామా ప్రసాద్ ఆధ్వర్యంలో పట్టణంలోని రైల్వే స్టేషన్లో పాడేరు నుంచి పుట్టపర్తి లో సేవ కోసం వెళుతున్న 35 మంది సేవాదళ్ సభ్యులకు భోజనపు ప్యాకెట్లను, వాటర్ ప్యాకెట్లను అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ఈ కార్యక్రమాలను దాతల సహాయ సహకారాలతో నిర్వహిస్తున్నామని చెప్పారు.

రిటైర్డ్ అధికారికి సన్మానం

ప్రజాశక్తి - చిలమత్తూరు

మండల కేంద్రంలోని పొట్టి శ్రీరాములు జెడ్పీ హైస్కూల్‌లో డివైయువో పద్మప్రియ ఉద్యోగ వివమణ సన్మాన కార్యక్రమం ఆదివారం ఘనంగా జరిగింది. ఉపాధ్యాయవృత్తిలో 36 సంవత్సరాల పాటు అంకితభావంతో వివిధ పదవుల్లో పనిచేసిన ఆమె సేవలను గుర్తించి సత్కారం నిర్వహించారు. విద్యార్థుల ప్రతిభను వెలికి తీసేందుకు విశేష కృషి చేసిందనిఉపాధ్యాయ సంఘాలు, సహచర ఉపాధ్యాయులు అన్నారు. అధికారులు శాలువా కప్పి, జ్ఞాపికలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో హిందూపురం ఎంఇఒ గంగప్ప, లేపాక్షి ఎంఇఒ నాగరాజు, చిలమత్తూరు ఎంఇఒ సల్మాన్ రాజ్, యుటిఎఫ్ శ్రీనివాసులు, గోపాల్ రెడ్డి మహేంద్ర తదితరులు పాల్గొన్నారు.

25 ఏళ్ల తర్వాత విద్యార్థుల అపూర్వ కలయిక

ప్రజాశక్తి - పుట్టపర్తి క్రైమ్

పూర్వపు విద్యార్థులు 25 ఏళ్ల తరువాత అపూర్వ కలయికతో ఎంతో అనుభూతి పొందారు. ఆదివారం స్థానిక సాయి ఆరామం వేదికగా పూర్వ విద్యార్థులు కలుసుకొని ఆనందాన్ని పంచుకున్నారు. 1999–2000 సంవత్సర పదవ తరగతి విద్యార్థులు కలుసుకొని వారి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. మొదట జీవితంలో స్థిరపడిన వ్యాపారవేత్తలు, బిల్డర్లు, ఉన్నత అధికారులుగా ఉన్న వారందరూ తమ వ్యాపకాలు గురించి ఒక్కొక్కరు వేదికపై పంచుకున్నారు. ఆనాటి బ్యాచ్ విద్యార్థులు ఒకరికొకరు ఆప్యాయంగా ఆనందంగా పలుకరించుకొని వారి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. తాము ఈ స్థాయికి కారుకునైన ఆనాటి తమ గురువులను శాలువాలు, పూలమాలలు కిరీటాలతో ఘనంగా సన్మానించి తమ గురుభక్తిని చాటుకున్నారు. నాటి ఉపాధ్యాయులు మల్లికార్జున, సత్యనారాయణ, మురళీమోహన్, దేవేంద్ర గుప్త, క్రిష్టప్ప, సులోచన, బసోబి తదితరులు మాట్లాడుతూ తాము తీర్చిదిద్దిన విద్యార్థులు నేడు ఎందరో ఉన్నత ఉద్యోగులు డాక్టర్, టీచర్, పోలీస్, రిపోర్టర్, బిల్డర్లుగా, రాజకీయ నాయకులుగా ఎదిగినందుకు ఆనందంగా ఉందన్నారు. ఎ అపూర్వ కలయికలో పాల్గొన్న ఆనాటి ప్రతి విద్యార్థికి ఇదొక తీపి గుర్తుగా అనుభూతి చెందే విధంగా మెమొంటోలను నాటి ఉపాధ్యాయులు చేత విద్యార్థులు అందుకున్నారు.



అప్పటి తమ గురువులతో పూర్వ విద్యార్థులు

దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయండి

ప్రజాశక్తి-హిందూపురం

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక, కర్షక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ జూలై 9వ తేదీన తలపెట్టిన దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని కార్మిక సంఘం నాయకులు కోరారు. ఈ సందర్భంగా ఆదివారం తూమకుంట పారిశ్రామిక వాడ కార్మిక సంఘం అధ్యక్షులు రవికుమార్ కార్మికులతో కలిసి కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతు కేంద్ర ప్రభుత్వం అవలంభిస్తున్న కార్మిక, కర్షక వ్యతిరేక విధానాలకు నిరసనగా దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో కార్మిక సంఘాలు పెద్ద ఎత్తున పాల్గొనాలని పిలుపునిచ్చారు. అందులో భాగంగా తూముకుంట పారిశ్రామికవాడలో కూడా 9వ తేదీ ఉదయం 10 గంటలకు ర్యాలీ నిర్వహిస్తామని తెలిపారు. అదే విధంగా అన్ని పరిశ్రమలకు సమ్మె నోటీసులు ఇవ్వడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో కార్మిక సంఘం నాయకులు పాల్గొన్నారు.

ఆయాలకు కనీసవేతనం ఇవ్వాలి

ప్రజాశక్తి - ధర్మవరం రూరల్

ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న ఆయాలకు కనీస వేతనం ఇవ్వాలని సిఐటియు నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం సిఐటియు ఆధ్వర్యంలో ఆయాల సమస్యలపై సమావేశంఏర్పాటు చేశారు, ఈ సందర్భంగా సి ఐ టీ యు నాయకులు జె వి రమణ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాల లో పనిచేస్తున్న ఆయాలకు కనీసం పదివేల రూపాయలు వేతనం పెంచాలని, ప్రతినెల 5వ తారీఖు లోపు వేతనాలు వచ్చే విధంగా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యపై సోమవారం జరిగే మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో స్థానిక ప్రజా ప్రతినిధులకు కూడా విన్నవించడం జరుగుతుంధన్నారు, ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు ఆయాలు చౌడమ్మ, జయమ్మ, ముంతాజ్ ,భాగ్యమ్మ, గంగమ్మ నాగలక్ష్మి ,పర్వీన, నంజమ్మ ,తదితరులు పాల్గొన్నారు.

యథేచ్ఛగా మట్టి తవ్వకాలు

అధికార పార్టీ అండతో చెరువుల నుంచి తరలింపు

ప్రజాశక్తి - చిలమత్తూరు

మండలంలోని దేమకేతేపల్లి పంచాయతీలోని ఓబులాపురం గ్రామంలో అక్రమ మట్టి తవ్వకాలు యథేచ్ఛగా సాగుతున్నాయి. అధికార పార్టీ నాయకుల అండదండలతో కొందరు వ్యక్తులు చెరువుల నుంచి అక్రమంగా మట్టిని తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. బెంగళూరుకు చెందిన ఒక ప్రైవేట్ భూమిని చదును చేసేందుకు ఈ మట్టిని భారీ ఎత్తున తరలిస్తున్నట్లు తెలుస్తోంది. "మాకు అధికార పార్టీ నాయకుల అండదండలు ఉన్నాయి, మమ్మల్ని ఎవరూ ఏమీ చేయలేరు" అంటూ ఆ గ్రామానికి చెందిన ఓ వ్యక్తి ఈ అక్రమ కార్యకలాపాలను పర్యవేక్షిస్తున్నాడని స్థానికులు వాపోతున్నారు. దీంతో ప్రభుత్వ ఆస్తులైన చెరువులు తీవ్రంగా దెబ్బతింటున్నాయని, పర్యావరణానికి కూడా నష్టం వాటిల్లుతోందని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఆదివారం సెలవు రోజు కావడం తో అధికారుల పర్యవేక్షణ ఉండదని ఇలా అక్రమాలకు పాల్పడుతున్నారని అంటున్నారు. సంబంధిత అధికారులు స్పందించి, అక్రమంగా మట్టి తరలిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి - ధర్మవరం రూరల్

పట్టణంలోని స్పందన హాస్పిటల్లో ఆదివారం నిర్వహించిన మూడు ఉచిత వైద్య శిబిరాలకు విశేష స్పందన వచ్చిందనిహాస్పిటల్ అధినేత డాక్టర్ బషీర్, డాక్టర్ సోనియా తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్పందన హాస్పిటల్‌లో ఉచిత సంతాన సాఫల్య శిబిరమునకు డాక్టర్ ఆర్ లావణ్య హాజరై సంతానం లేని దంపతులకు వివిధ వైద్య చికిత్సలతో పాటు, సంతానం కావడానికి తగిన సలహా సూచనలు ఇచ్చారన్నారు.

సర్పంచుల కుటుంబానికి 'తల్లికి వందనం' అమలు చేయాలి

ప్రజాశక్తి - ధర్మవరం రూరల్

రాష్ట్ర వ్యాప్తంగా తల్లికి వందనం పథకాన్ని సర్పంచుల కుటుంబాలకు వర్తింపజేయాలని వైసిపి రాష్ట్ర పంచాయతీరాజ్ విభాగం ప్రధాన కార్యదర్శి అప్పిరెడ్డి సురేష్ రెడ్డి కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంచాయతీ రాజ్ విభాగపు సమస్యలపై సోమవారం జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించనున్నట్లు చెప్పారు.ఉపాధి హామీ పథకంలో జరుగుతున్న అవినీతిపై కేంద్ర ప్రభుత్వం వెంటనే విచారణ చేయించాలని డిమాండ్ చేశారు. 15వ ఫైనాన్స్ కమిషన్ విడుదల చేసిన నిధులను 1,150 కోట్ల సొమ్మును స్థానిక సంస్థలకు తక్షణమే జమ చేయాలన్నారు. ఈ సమస్యలన్నింటిపై పుట్టపర్తి జిల్లా కలెక్టరేట్లో వినతిపత్రం సమర్పిస్తున్నామని కావున గ్రామపంచాయతీ సర్పంచులు, ఎంపీటీసీలు, జడ్పిటిసిలు, ఎంపీపీలు, పార్టీ కార్యకర్, పార్టీ నాయకులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని వారు కోరారు.

ఆకట్టుకున్న భరతనాట్యం

ప్రజాశక్తి - పుట్టపర్తి అర్బన్

స్థానిక శిల్పారామంలో నిర్వహించిన భరతనాట్యం ఆకట్టుకుంది. ఆదివారం వారాంతపు సెలవు కారణంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో అభిజ్ఞ అభ్యాస ఆర్ట్స్ అకాడమీ వారు భరతనాట్యాన్ని ప్రదర్శించారు. ఇందులో త్యాగరాజ కృతి, అన్నమయ్య కృతి, వందే వాసుదేవం, ముద్దుగానే యశోద, సీతారామ వర్ణం, భజరే రామరసం, ఆనంద తాండవం మొదలైన నృత్యాలు ఆహుతులను ఆకట్టుకున్నాయి. ఇందులో ఆ అకాడమీ ఆధ్వర్యంలో హరిప్రియ, హేమ వర్షిని, సుప్రజా, నిహారిక, అనూష, సాయి భార్గవి తదితర 20 మంది నృత్య కళాకారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా శిల్పారామం ఏవో ఖాదర్ వలీ మాట్లాడుతూ, వారాంతపు సెలవు కారణంగా ఆదివారం పట్టణ ప్రజలు, ఉద్యోగులు, విద్యార్థులకు ఆటవిడుపుగా ఈ ప్రదర్శన ఏర్పాటు చేశామన్నారు. పట్టణ ప్రజలతోపాటు పరిసర గ్రామాల ప్రజలు ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేసినందుకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.



భరతనాట్యం చేస్తున్న నృత్యకారిణులు

ఆశా వర్కర్ల పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాశక్తి - నంబులపూలకుంట

మండలంలోని మేకల చెరువు వెలిచెలవల తదితర గ్రామాలలో ఆశ వర్కర్లు పోస్టుల భర్తీకి అర్హత, ఆసక్తి ఉన్న వారు దరఖాస్తు చేసుకోవాలని వైద్యాధికారి ఆనంద్ వర్ధన్ కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆశ వర్కర్ పోస్టుకు ఆయా సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. జుల్తై 4వ తేదీ లోపల దరఖాస్తులు చేసుకుని స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో దరఖాస్తులు చేసిన జిరాక్స్ సెట్ అందజేయాలని చెప్పారు.

నల్లమాడ : స్థానిక రెడ్డిపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో ఖాళీగా ఉన్న ఆశా కార్య కర్తల పోస్టుల భర్తీకి దరఖాస్తు చేసుకోవాలని రెడ్డిపల్లి వైద్యాధికారి దీప్తి కోరారు. జూలై 4 వ తేదిలోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. నేరాలవంక తండా, ఎర్రవంకపల్లి పరిధిలోని ఆశా కార్యకర్తల పోస్టులు ఖాళీగా ఉన్నాయని చెప్పారు.

హిందూపురం : హిందూపురం పట్టణంలోని పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలోని వివిధ వార్డులలో ఖాళీగా ఉన్న ఆశా కార్యకర్తల పోస్టులకు అర్హత కలిగిన మహిళా అభ్యర్థుల నుండి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు స్థానిక జిల్లా అస్పత్రిలోని పిపియూనిట్ వైద్యాధికారి డాక్టర్ కెసికె నాయక్ ఆదివారం తెలిపారు. పట్టణంలోని లక్ష్మీపురం ఆరోగ్య కేంద్ర పరిధిలో ఉన్న 4వ వార్డు, రెండవ ఆర్‌టిసి కాలని, శ్రీనివాసనగర్ ఆరోగ్య కేంద్ర పరదిలోని 32 వ వార్డు అహమద్ నగర్, ఇందిరానగర్ ఆరోగ్య కేంద్రం పరిధిలోని14 వ వార్డు సూగురు సచివాలయాల పరిధిలో మొత్తం మూడు ఖాళీలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు వివరించారు. ధరఖాస్తులు ఈ నెల 30వ తేది నుంచి జూలై 4వ తేది వరకు స్వీకరిస్తామన్నారు. ధరఖాస్తుదారులు వయస్సు 25–45, పదవ తరగతి ఉత్తీర్ణతతో పాటు వివాహం అయి ఉండి, స్థానికులై ఉండాలన్నారు. ఇతర వివరాములకు సంబంధిత ఆరోగ్య కేంద్రాల్లో సంప్రదించాలని తెలిపారు.

నేరాలు ఘోరాలు

మహిళ అనుమానాస్పద మృతి

వరకట్నం వేధింపులతో హత్య చేశారని తల్లిదండ్రుల ఫిర్యాదు

ప్రజాశక్తి బుక్కపట్నం

వరకట్న వేధింపులతో వివాహమైన ఏడు నెలలకే అత్తింటి వారి వరకట్న వేధింపులతో మహిళ శ్రావణి (22)మృతిచెందిన ఘటన మండల పరిధిలోని కృష్ణాపురం గ్రామంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు కృష్ణాపురం గ్రామానికి చెందిన నీలకంఠచారికి పామిడి గ్రామానికి చెందిన రామాచారి, పుష్పావతి కుమార్తె శ్రావణికి ఎనిమిది నెలల క్రితం వివాహమైంది. అప్పటినుంచి వరకట్నంకోసం శ్రావణిని వేధించేవారనిఈ క్రమంలోనే శనివారం ఉదయం తమ కూతురిని హత్య చేసి ఆత్మహత్యగా చిత్రీకరించేందుకు సిద్ధమయ్యారని మృతురాలి తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. డీఎస్పీ విజయ్ కుమార్, కొత్తచెరువు రూరల్ సీఐ సురేష్, గ్రామానికి వెళ్లి విచారణ చేపట్టారు. మృతురాలి తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ కృష్ణమూర్తి తెలిపారు.

తల్లిదండ్రులపై హత్యాయత్నం కుమారుడు అరెస్టు

ప్రజాశక్తి - బత్తలపల్లి

మద్యం తాగేందుకు డబ్బులు ఇవ్వలేదన్న కారణంతో తల్లిదండ్రులపై హత్యాయత్నానికి పాల్పడిన కుమారుడిని ఆదివారం అరెస్టు చేసి రిమాండుకు తరలించినట్లు బత్తలపల్లి ఎస్ఐ సోమశేఖర్ తెలిపారు. ఆదివారం ఆయన స్థానిక పోలీస్ స్టేషన్లో విలేకర్లతో మాట్లాడుతూ 2023 నవంబర్ 22వ తేదీన అర్ధరాత్రి 11 గంటల సమయంలో మండలంలోని గంటాపురం గ్రామంలో వృద్ధ దంపతులు జాంపుల అప్పస్వామి, లక్ష్మీదేవిపై వారి కుమారుడు సురేష్ బాబు అలియాస్ బాబుల్లా అను వ్యక్తి దాడి చేశాడన్నారు. మద్యం తాగేందుకు డబ్బులు ఇవ్వలేదని కారణంతో వారిని చంపాలన్న ఉద్దేశంతో కొడవలితో వారి మొహంపైన, తలపైన నరికినాడని అప్పస్వామి ఇచ్చిన ఫిర్యాదు మేరకు హత్యయత్నం కేసును అప్పటి ఎస్ఐ శ్రీనివాసులు నమోదు చేసినట్లు తెలిపారు. అప్పటి నుంచి పరారీలో ఉన్న సురేష్ బాబును ఆదివారం గంటాపురం క్రాస్ వద్ద అరెస్టు చేసినట్లు చెప్పారు.

అదనపు కట్నం వేధింపులపై కేసు

ప్రజాశక్తి - కదిరి టౌన్

భర్త ఇతర కుటుంబ సభ్యులు అదనపు కట్నం కోసం తనను వేధింపులకు గురిచేస్తున్నారని బాధితురాలు ఇచ్చిన పిర్యాదు మేరకు పట్టణ పోలీసులు కేసు నమోదు చేసినట్లు పట్టణ సీఐ నారాయణరెడ్డి తెలిపారు. ఈకేసుకు సంబందించి సిఐ చెప్పిన వివరాలు... కదిరి పట్టణం, రైల్వే స్టేషన్ రోడ్డులో నివాసమున్న ఓబులదేవర చెరువులోని ఎడిసిసి బ్యాంక్ లో అసిస్టెంట్ మేనేజర్ గా పనిచేస్తున్న ఎన్. ప్రవల్లికకి నాలుగు సంవత్సరాల క్రితం కదిరి టౌన్ రాజీవ్ గాంధీ నగర్ కి చెందిన కే. సాయికుమార్‌తో వివాహమైంది. పెళ్లి సమయంలో 20 సెంట్లు స్థలం, 9 తులాల బంగారం ఇస్తామని చెప్పి తర్వాత ఇవ్వలేదనే నెపంతో 15 రోజులకే ప్రవల్లికను పుట్టింటికి పంపించారు. పెళ్లయిన మూడు నెలలకు సాయికుమార్ ఇంకో పెళ్లి చేసుకోవాలని ఉద్దేశంతో విడాకులు ఇవ్వాలని ప్రవల్లికను బలవంతం చేశాడు. అంతే కాకుండా సాయికుమార్ పిన్ని శాంతమ్మ, బాబాయిలు కొమ్ము భాస్కర్, కొమ్ము సంపత్ , శంతన్ కుమార్ అల్లా పల్లి వెంకట రమణ తదితరులు ప్రవల్లికను తనను అదనపు కట్నం తీసుకురావాలని , శారీరకంగా వేదింపులకు గురిచేస్తూ చంపుతామని బెదిరిస్తున్నారని ప్రవల్లిక ఫిర్యాదు చేసిందన్నారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు ఆమె భర్త సాయికుమార్, అతని బంధువులు శాంతమ్మ కొమ్ము భాస్కర్ రాజీవ్, సంపత్ , శంతన్ కుమార్, వెంకట రమణ లపై కేసు నమోదు చేసినట్లు సిఐ చెప్పారు.

ప్రమాదంలో కారు దగ్ధం

ప్రజాశక్తి - నల్లమాడ

మండలంలోని చెర్లోపల్లి కెనాల్ బ్రిడ్జిపై కారు దగ్ధమైంది. నల్లమాడ మండలం రెడ్డిపల్లికి చెందిన వెంకట శివారెడ్డి కుటుంబ సభ్యులతో కలిసి అనంతపురం వెళుతుండగా చెర్లోపల్లి కెనాల్ కాల్వ దగ్గరికి రాగానే బ్యాలెట్ నుంచి పొగలు రావడం కుటుంబ సభ్యులు గమనించి కారులో నుంచి కిందికి దిగారు. వారు కిందికి దిగగానే వెంటనే కారులో మంటలు వ్యాపించి కారు దగ్ధమైందని గ్రామస్తులు తెలిపారు.

వ్యాపారి మోసం చేసాడని పోలీసులకు ఫిర్యాదు

ప్రజాశక్తి:కొత్తచెరువు

కంబదూరు మండలం తిమ్మాపురం గ్రామానికి చెందిన వంకదారి రవికుమార్ మొక్క జొన్న, వేరుశెనగ కొనుగోలు అమ్మకాలు నిర్వహించేవాడు. ఈ నేపథ్యంలో కొత్తచెరువుకు చెందిన వ్యాపారి దాల్ మిల్ సూరికి 2.50లక్షల విలువ చేసే వేరుశెనగ మే నెల 8వ తేదీన 27 .50 లక్షల అలాగే 12వేల క్వింటాళ్ల మొక్కజొన్న మొత్తం రూ. 30లక్షల విలువ చేసే సరుకు దాల్ మిల్ సూరికి అందజేశాడు. వీటికి సంబందించి ఇప్పటి వరకు డబ్బులు ఇవ్వకుండా తిప్పుకుంటున్నాడని కొత్తచెరువు పోలీస్ స్టేషన్‌లో బాధితుడు ఫిర్యాదు చేసినట్లు సిఐ మారుతీ శంకర్ తెలిపారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఆయన తెలిపారు.

కేరళనుంచి కదిరికి చేరిన చిన్నారి

ప్రజాశక్తి - కదిరి టౌన్

కదిరి రూరల్ మండలం మరవతండాకు చెందిన రవీంద్ర నాయక్, శ్రీవాణిల చిన్నారిని పోలీసలు కేరళ నుంచి కదిరికి తీసుకువచ్చారు. ఈ ఘటనకు సంబందించిన కదిరి రూరల్ అప్గ్రేడ్ పోలీస్ స్టేషన్లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో డీఎస్పీ శివనారాయణ స్వామి వివరాలు వెల్లడించారు.కదిరి రూరల్ మండలం మరవ తండాకు చెందిన రవీంద్ర నాయక్ శ్రీవాణి దంపతులు ఉపాధి నిమిత్తం కేరళకు వెళ్ళారు.ఈ దంపతులకు ముగ్గురు పిల్లలుండగా వారిలో తృతీయ సంతానమైన చిన్నారిని కేరళకు చెందిన రాజేష్ దంపతులకు పిల్లలు లేకపోవడంతో నెల రోజులు క్రితం వారికి ఇచ్చారు. ఈ విషయం గురించి కుటుంబ సభ్యులు మధ్య చిన్నపాటి ఘర్షణ చోటుచేసుకుంది. దీంతో ఈ విషయం పోలీసులు దృష్టికి రావడంతో ఎస్పి వి రత్న ఆదేశాల మేరకు కదిరి రూరల్ అప్గ్రేడ్ సిఐ నిరంజన్ రెడ్డి ఆధ్వర్యంలో ప్రత్యేక టీం కేరళకు వెళ్లింది.డీఎస్పీ శివనారాయణ స్వామి పర్యవేక్షణలో ప్రత్యేక టీం 48 గంటల్లో కేరళకు వెళ్లి చిన్నారిని సురక్షితంగా ఆదివారం కదిరికి తీసుకువచ్చారు. అయితే ఆర్థిక పరిస్థితుల ప్రభావంతో చిన్నారిని విక్రయించారా లేదా వీరే వారికి స్వయంగా అప్పగించినారా అనేది పూర్తిస్థాయిలో దర్యాప్తు లో తేలాల్సి ఉంది. విచారణ అనంతరం బాధ్యులపై చర్యలు తీసుకుంటామని డీఎస్పీ తెలిపారు.

రౌడీ షీటర్లు నేర ప్రవృత్తికి స్వస్తి పలకాలి : ఎస్పీ

ప్రజాశక్తి పుట్టపర్తి రూరల్

రౌడీషీటర్లు నేరపవృత్తికి స్వస్తి పలకాలని ఎస్పీ రత్న సూచించారు. ఈ మేరకు ఆమెజిల్లాలో నేరనియంత్రణ , శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా పోలీసు అధికారులకు పలు సూచనలు చేశారు. ఆదివారం అన్ని పోలీసు స్టేషన్ల పరిధిలలో రౌడీ షీటర్లకు , నేరచరిత్ర గలవారికి , చెడు నడత కలిగిన వ్యక్తులకు కౌన్సిలింగ్ నిర్వహించారు. సత్రవర్తనతో జీవించాలని, నేర ప్రవృత్తికి స్వస్తి పలకాలని, చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని సూచించారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలలో పాల్గొంటే తప్పనిసరిగా చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. ఆయా పోలీస్ స్టేషన్ల పరిధిలో నేర ప్రవృత్తి పైన జీవించే వారి సమాచారం, కదలికలపై నిఘా ఉంచాలని పోలీసులకు సూచించారు.

మొహర్రం నిర్వహణకు అనుమతి తప్పనిసరి

ప్రజాశక్తి - గాండ్లపెంట

మండలంలోని గ్రామాల్లో మొహరం పండుగ నిర్వహించుకోవటానికి తప్పనిసరిగా అనుమతి తీసుకోవాలని జమేదార్ గంగాధర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల వ్యాప్తంగా మొహరంను ఆయా గ్రామాల ప్రజలు ప్రశాంతంగా జరుపుకోవాలని ఆయన తెలిపారు

నంబులపూలకుంట : మండల వ్యాప్తంగా 14 గ్రామపంచాయతీలోనూ మొహరం పండుగ జరుపుకోవడానికి అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని ఎస్ఐ వలిబాషా తెలిపారు ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామాలలో మొహరం జరుపుకోవడానికి అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. పండుగ సందర్భంగా అల్లర్లు ఘర్షణలు చోటుచేసుకోకుండా ప్రశాంతంగా నిర్వహించుకోవాలని సూచించారు.